
**తెలుగు కళాసమితి (న్యూజెర్సీ) 1988 ఉగాది మినీ కథల పోటీలో**
**రు. 300 లు గెలుపొందిన కథ**

# ఆత్మవిశ్వాసం



—ఎ. సువర్ణ

హెడ్ క్లార్క్ రామభద్రుడుకి, హెడ్‌మాస్టరు చలమయ్యగారికి వందనం గాడికి ఎట్లా తెలియజెప్పాలో తెలియక ఒకరి మొహాలొకరు చూసుకుంటున్నారు.

"ఇదిగో చూడు వందనం.."

హెడ్ క్లార్కుని చెప్పనివ్వకుండా... "దొరగారూ నేను కన్న నా బుడ్డడికి ఎవరో డబ్బు కట్టి ఎందుకండీ చదివిస్తారు...?" అంటూ అడిగాడు వందనం.

వాళ్లిద్దరు 'వీడు నిజంగా తెలీకే అంటున్నాడా! గవర్నమెంటు వాళ్ల వెనకపడిన జాతి వాళ్ళకి ఇచ్చే రాయితీలు గురించి వీడికి తెలీదా...'అనే మనస్సులోని వాళ్ళ అనుమానం వాళ్ళ కళ్లలో కనిపిస్తోంది.

ఇద్దరూ ఒకేసారి వందనంగాడిని చూస్తున్నారు. వాళ్లకి వాడి కళ్లలో అమాయకత్వమే కనిపిస్తోంది.

"అయ్యా!వీడు వీడి తల్లి కడుపున పడగానే ఇద్దరం అనుకున్నాము... మాకు పుట్టబోయే బిడ్డని బాగా చదివించుకోవాలని... అప్పటి నుంచే నేను సంపాదించే దాంట్లోంచి కొద్ది కొద్దిగా డబ్బు వెనకేసుకొస్తున్నాను.."

"చదివించమనే మేము అంటున్నాము... అందుకు నువ్వు డబ్బేమీ ఖర్చు పెట్టక్కరలేదు..." అంటూ గవర్నమెంటు ఇస్తున్న సౌలభ్యాలను గురించి వివరించారిద్దరు మళ్ళీ ఇంకోసారి.

'ఇందులో ఏదో కిటుకు వుండే వుంటుంది. ఏ కారణం లేకుండానే ఆరు నమ్మల్ని వూరికే చదివిస్తారా... వారేదో కుట్ర పన్నుతున్నారు. ఇప్పుడు మా బుడ్డోడికి డబ్బిచ్చి చదువు చెప్పించి నా కొడుకుని ఆరు లాగేసుకుంటారేమో!' అంటూ ఏవేవో ఆలోచిస్తున్నాడు వందనం మనస్సులో.

స్కూలును చూసుకుంటూ వచ్చిన వందనంగాడి కొడుకు కిష్టిగాడు వూడిపోతున్న లాగూని పైకి లాక్కుంటూ తండ్రి వెనక్కాల నిల్చున్నాడు.

"నీ కొడుక్కి ఎన్నేళ్లురా...!" ఆ వూళ్లో సందులు తోలుకుంటూనూ, పాయిఖానాలుకడుగుతూనూ జీవనం వెళ్లదీస్తున్న వందనాన్ని అడిగారు హెడ్‌మాస్టరు గారు.

"మొన్న ఉగాది పండక్కి ఆరేళ్లు నిండినయ్యి దొరా..."

ఆయన తనని గురించే అడుగుతున్నారని తెలుసుకున్న కిష్టిగాడు తండ్రి రెండు కాళ్ల మధ్య మొహం దాచుకుంటున్నాడు.

మంచి పుష్టిగా కనిపిస్తున్న కిష్టిగాడిని ఎట్లా స్కూలులో ఎడ్మిట్ చేసుకోవాలా అని ఆలోచిస్తున్నారు హెడ్‌మాస్టరుగారు.

కాసేపు ఎవరు మాట్లాడలేదు... అక్కడ మౌనం...

అప్పుడు కొడుకు మెల్లిగా తండ్రిని "అయ్యా..." అంటూ పిలిచాడు. తండ్రి కిందికి వంగి అంత మెల్లిగానే "ఏంట్రా..?" అంటూ కొడుకు చెవిలో అడిగాడు.

"అయ్యా నన్ను బళ్ళో చేర్చుకోమంటున్నారా... అయ్యా నేను పంతులు గారు చెప్పినట్లే వింటాను ఆరు చదమన్నవి చదువుతాను..."

పక్క క్లాసులోంచి... "మూడొకట్లు మూడు... మూడు రెళ్లు ఆరు..." అంటూ కోరస్‌గా వల్లె వేస్తున్న ఎక్కాలు వినిపిస్తూంటే కిష్టిగాడికి తను వాళ్ళతో చేరి అట్లా అనాలనే ఉత్సాహం వాడిలో పెల్లుబుకుతోంటే తండ్రిని అడుగుతున్నాడు.

"చేర్చుకుంటారురా! వుస్ గట్టిగా అనమాక... చేర్చుకుంటారురా. మా నాన్నా.. దిగులు పడమాకరా" కొడుకుని దగ్గరగా తీసుకున్నాడు వందనం.

"ఈ స్కూలు మంచిదని తన బుడ్డోడిని ఈ ఇస్కూలులో చేర్చాలని తనొస్తే తాసీల్దారు అయ్యగారి దగ్గరకెళ్ళి తమ జాతి పేరు రాసుకురమ్మంటారేమిటి దొరలు...' వందనంగాడికి ఎంత ఆలోచించినా తమ జాతిని ఆయనెందుకు రాసెయ్యాలో తెలియడం లేదు... 'మా లాంటి ఆరికి చదువు రాదని ఆరి భయమేమో..' అంటూ వాడి మనస్సులో ఎన్నో సందేహాలు...

మట్టి నాగలి, ఆకాశం, వానలనే తెలిసిన వాడికి దేశంలోని సంగతులు తెలియవల్లే వుంది.

"దొరా! అయితే నాకు తెలీక అడుగుతున్నాను... మిగిలిన అందరు పిల్లలు మాలానే తసీల్దారు బాబుకాడ నుంచి ఆరి జాతి పేరు రాయించుకుని రావాలా అండీ...?"

తెలుగు కళాసమితి (న్యూజెర్సీ) వారి బహుమతి పొందిన కార్టూను




"అక్కరలేదురా! మీ లాంటి తక్కువ కులపోళ్ళు మాత్రం తాసీల్దారు దగ్గర నుంచి కాగితం రాయించు కొస్తే మేము దాన్ని ప్రభుత్వానికి పంపిస్తాము. మీ పిల్లల చదువుకయ్యే ఖర్చంతా వారే భరిస్తారు..."

పండితుడైన హెడ్‌మాష్టరుగారికి ఎక్కువగా పండితులతోనే పరిచయం. అట్లాంటి పండితునికి ఈ పామరునికి తెలియజెప్పడం కష్టంగానే వుంది.. వందనంగాడు అడిగే ప్రశ్నలకు జవాబు చెప్పలేక పోతున్నారు హెడ్‌మాష్టరుగారు. పామరుడడిగిన గుప్పెడు ఇసుక ఎంతో చెప్పలేకపోయిన లెక్కల పండితునిలా వుంది హెడ్‌మాష్టరుగారి పరిస్థితి.

"అయితే గొప్పజాతాళ్లందరు తాసీల్దారుబాబు దగ్గర నుంచి కాగితం పట్టాక్కరలేదా అండీ సామీ..."

"అక్కర్లేదు గాని డబ్బు మాత్రం కట్టాలిరా వాళ్ళందరూ..."

"దొరా తమర్ని ఇట్టా అడుగుతున్నానని కోపగించుకోకండి. తమరికి నేను మాదిగాడినని చెప్పబట్టే కదా తెలిసింది... నేను ఏ గొప్ప కులపోణ్ణోనని చెబితే..."

"నాకే సమస్య వుండేది కాదురా... ఏం మాట్లాడకుండా నీ చేత డబ్బు కట్టించుకుని నీ కొడుకుని బళ్ళో చేర్చుకునుండేవాడిని.. మాకేం నష్టం లేదు. నష్టపోయేది మీరే అప్పుడు..."

అందుకు వందనం మేధావుల్ని మించిన పెద్ద ఉపన్యాసం ఇచ్చాడు.

"దొరా, నా కన్న బిడ్డకి నేను కష్టపడిన డబ్బులోంచి చదువు చెప్పిస్తాంటే వచ్చే సంతోషం ఎవరో జాలి తలిచి మా మీద బిచ్చం వేస్తున్నట్లుగా చదువు చెప్పిస్తాంటే వుంటుందా సామీ... నా కొడుకు స్కూలు కెడుతూ పలక కొనియ్యి అయ్యా... పుస్తకం కొని ఇయ్యి అయ్యా... బొక్కులు కొని ఇయ్యి... అట్లా ఎన్నో... బడికి తీసుకెళ్లేందుకు బట్టలు కొనియ్యి... అంటూ నా కొడుకు అడిగితే నేను వాడిని బజారుకి తీసికెళ్లి రెండు మూడు కొట్లలో చూసి బేరం ఆడి కొనియ్యా లని నాకెంతో ఆశగా వుంది దొరా. బడికి జీతం కట్టాలని ఆడు అడిగితే నేను రాత్రింబగళ్ళు కష్టపడి పని చేసి ఆడి బడి జీతం కట్టాలని నాకుంది దొరా... ఎవరో డబ్బుతో నా కొడుకు చదివి డిగ్రీ తీసుకోవడం నాకిష్టం లేదు బాబూ... నా ఒంట్లో బాగా శక్తి వుంది... నా కొడుకు చదువు కోసరం నన్ను కష్టపడనివ్వండి దొరా... మీరు కట్టమన్న డబ్బులు ఇప్పుడే కట్టేస్తాను దొరా.. మీకే జాతి అని రాయాలని వుంటే ఆ జాతని రాసెయ్యండి దొరా..." వందనంగాడి మాటలకి ఇద్దరికీ ఆశ్చర్యంతో నోటి మాట రావడం లేదు.

కన్న పిల్లకి తిండి గుడ్డ ఇయ్యకుండా గాలికి ధూళికి వదిలేసి వాళ్ళ సంపాదించిన డబ్బుతో పీకల మొయ్య తాగి తందనాలాడేవాళ్ళనే చూసిన వాళ్లకి వందనంగాడో ప్రశ్నగా కనిపిస్తున్నాడు.

"ఈ ఆత్మవిశ్వాసిని గిన్నీస్ బుక్‌లోకి ఎక్కించాల్సిందే...!"

ఛండాలుని వల్ల ఆత్మ దర్శనం చేసుకున్న శంకరాచార్యులు గుర్తుకొచ్చారు హెడ్‌మాష్టరుగారికి.

పొద్దున జరిగిన ఆ సంఘటన గుర్తు చేసుకుంటూ నడుస్తున్నాడు హెడ్‌మాష్టరుగారు. పంట పొలాల గట్లంట నడుస్తున్న ఆయనకి "అయ్యా... హెడ్ మాష్టరుగారూ.." అన్న పిలుపు వినబడి వెనక్కి తిరిగిన ఆయనకి ఆ వూళ్ళో మోతుబర్లలో ఒకరైన చౌదరిగారు తనకేసి చెయ్యి వూపుతూ వస్తూండడం కనిపించింది.

ఇద్దరు కలసి తాళ్ల వరకు నడుచుకుంటూ వచ్చి తాళ్ల మధ్య కూర్చున్నారిద్దరు. దేశంలోని ఎన్నో విషయాల గురించి మాట్లాడుకున్నారిద్దరు.

"హెడ్ మాష్టరుగారూ, మీరేం అనుకోనంటే..."

"ఏం అనుకోను చెప్పండి..."

"తెనాల్లో మా వాళ్ళు వైన్ షాపు కొత్తగా తెరిచారు. గోవా నుంచి మంచి కొత్తరకం సరుకు తెప్పించారు. మీకు తీర్థం పుచ్చుకునే అలవాటు..."

చౌదరి గారు అంటున్న మాటలకి ఆశ్చర్యపోతున్నారు హెడ్‌మాష్టరు.

"నాతో ఎందుకా విషయం చెబుతున్నారు"

"అబ్బే ఏం లేదు... తమరికి రెండు బాటిల్సు ఇద్దామనే..." సణిగారు చౌదరిగారు.

"అబ్బే నాకట్లాంటి అలవాట్లు లేవండీ.. ఏమిటి ఇట్లా కొత్తగా అడుగుతున్నారు..." చెలమయ్యగారికి తెలిసిపోయింది చౌదరికి తనతో ఏదో పని పడిందని.

హెడ్‌మాష్టరుగారు తీర్థం పుచ్చుకోననేసరికి కాస్త నిరాశపడ్డాడు చౌదరి. దాన్ని బయటికి కన్పడనీయలేదాయన.

కాసేపు మళ్లీ ఏవో మాటలు మాట్లాడిన తరువాత చౌదరి వల్లకొచ్చి ఎంతసేపని ముంత దాచడం అని అనుకొని వల్లగా అసలు విషయం బయట పెట్టారు హెడ్ మాష్టరుగారు"ఏమిటి అసలు విషయం"అంటూ అడగగానే-

"ఆ! అంత పెద్ద విషయం ఏం కాదు లెండి. మా మనమలు, మేనల్లుడు మీ బళ్ళోనే చదువుతున్నారు. వాళ్ళని చేర్పించేప్పుడు తెలీక మా అసలు జాతి రాసేశాము. ఆ తరువాత కాలేజీలలో సీట్లకి, ఉద్యోగాలకి నానా తంటాలు పడాల్సివస్తుంది మా కులం వాళ్ళు.. నేను మొన్న తాసీల్దారుగారితో మాట్లాడాను... మేము వెదురు బుట్టలు అల్లే జాతి అని రాసి ఇస్తానన్నారు. అది మీతో మాట్లాడి ఒప్పించమన్నారు. రేపు పొద్దున తీసుకొస్తాను..." అంటున్న చౌదరి మాటలకి అవాక్కైపోయారు హెడ్‌మాష్టరు గారు.

"గవర్నమెంటు ఆ చదువురాని వాళ్లకి అన్ని సౌకర్యాలు చేసి ఇస్తోంది... మనకేం లేవు. అందుకనే అనవసరంగా డబ్బు ఎందుకు ఖర్చు పెట్టాలి సార్..."

తక్కువ జాతి వాడైన వందనంగాడు ఆకాశం అంత ఎత్తు ఎదిగినట్లుగాను, చౌదరి వామనుడిగాను హెడ్ మాష్టరుగారి కళ్లకి కనిపిస్తుంటే చౌదరిగారికి ఏం జవాబు చెప్పాలో తెలియక చెప్పకుండానే లేచి చెప్పు లేసుకుని, ఉత్తరీయం దులిపి భుజాన వేసుకు వెడుతున్న హెడ్ మాష్టరుగారినే చూస్తున్నాడు చౌదరి.